

సంక్షేమాభివృద్ధిని చూసి ఓటు వేయండి

- ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా రవి
- 6వ వార్డులో విస్తృత పర్యటన


6వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి


తండ్రి శిల్పామోహన్‌రెడ్డి ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే

నంద్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కోరారు. బుధవారం సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా తన స్వగృహంలో తండ్రి మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆశీస్సులు తీసుకున్నారు. భార్య శిల్పా నాగినిరెడ్డి ఎదురు రాగా ప్రచారానికి బయల్దేరారు. పట్టణంలోని 6వ వార్డులోనున్న గణపతిస్వామి దేవాలయం, దర్గా, జగజ్జననీ అమ్మవారికి పూజలు చేశారు. అదే వార్డులో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, కౌన్సిలర్ పురందర్ కుమార్, మాజీ కౌన్సిలర్ భీమునిపల్లె వెంకటసుబ్బయ్యతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో మీ ఇంటికి జరిగిన లబ్ధిని గుర్తించి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి తావు లేకుండా పారదర్శక పాలన సాగించారని, రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతోనే నేడు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతున్నామన్నారు. నియోజకవర్గంలో గడప గడపకు తిరిగి ప్రజా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించామని చెప్పారు. నంద్యాల టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ మంత్రిగా, డిప్యూటీ స్పీకర్, కౌన్సిల్ చైర్మన్‌గా పని చేసినా నంద్యాలకు ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఏఏ అమలును నాడు వ్యతిరేకించిన వీరు.. నేడు వారికే వంత పాడుతున్నారనేది ప్రజలు గమనించాలన్నారు. మేము చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తుంటే.. 40 సంవత్సరాల ఇండస్ట్రీ అని చెప్పుకొనే టీడీపీ నాయకులు ఇంకా తాము వస్తే అది చేస్తాం, ఇది చేస్తామని ప్రజలకు మాయ మాటలు చెబుతున్నారంటే ఎవరి చిత్తశుద్ధి ఏంటో ప్రజలు గుర్తించాలన్నారు. వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు పీపీ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, డైరెక్టర్లు సునిత అమృతరాజ్, శశికళారెడ్డి, పార్థి గోస్పాడు, నంద్యాల మండలాల కన్వీనర్లు రాజశేఖర్‌రెడ్డి, బసవేశ్వరరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ విజయశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు దాల్‌మిల్ అమీర్, సాయిరాంరెడ్డి, సలాముల్లా, పట్టణ వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అధ్యక్షులు పడకండ్ల సుబ్రహ్మణ్యం, జాకీర్ హుసేన్, పున్నాశేషయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఈ- రిపోర్టుతో కచ్చితమైన చికిత్స

నంద్యాల టౌన్: సర్వజన ఆసుపత్రిలో బయోకెమిస్ట్రీ, పాథాలజీ, మైక్రో బయాలజీ ల్యాబ్‌లలో నిర్వహించిన వైద్య పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఈ-హాస్పిటల్ రిపోర్ట్‌ను రోగులకు అందజేస్తామని, దీంతో రోగికి కచ్చితమైన చికిత్స అందించవచ్చని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మదన్ మోహన్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పరీక్షల ఫలితాల ఆన్‌లైన్ ప్రింట్‌ను రోగులకు అందజేయాలని డీఎంఈ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలోని ల్యాబ్‌లలో నిర్వహించిన పరీక్ష ఫలితాలను రోగి ఓపీ నంబర్‌తో అనుసంధానం చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. దీని వల్ల రోగికి ఎప్పుడు ఏ పరీక్షలు నిర్వహించారో తెలుస్తుందని, ఒకవేళ ఈ రిపోర్ట్ పేపర్ పోయినా ఓపీ నంబరు ద్వారా గతంలో చేసిన పరీక్షల వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు.

ముగిసిన పది పరీక్షలు


రుద్రవరంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు


పరీక్ష అనంతరం తల్లితో కలిసి వెళ్తున్న విద్యార్థిని

రుద్రవరం: మండలంలో ఈ నెల 18వ తేదీన మొదలైన పదో తరగతి పరీక్షలు బుధవారం ముగిశాయి. మండలంలోని రెండు పరీక్ష కేంద్రాలైన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, నర్సాపురంలోని ఎస్టీ థోమస్ మార్తోమా పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలు ప్రారంభం నుంచి ముగిసే వరకు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా సాగాయి.

చాగలమర్రి: ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు బుధవారం సోషియల్ పరీక్షతో ముగిశాయి. మండలంలో 780 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. పెద్దబోధనం గ్రామానికి చెందిన విద్యార్థిని సుజీత కోసం తల్లి శాంతి కూలీ పనులకు వెళ్తూ రోజూ పరీక్ష కేంద్రం వద్దకు వచ్చి బిడ్డను వెంట తీసుకెళ్లేది. తనలాగా తన కూతురు కూలీగా కష్టపడకూడదనే ఉన్నత విద్యను చదివిస్తానని చెబుతోంది.

దొర్నిపాడు: మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాతంగా ముగిశాయని చీఫ్ సూపరింటెండెంట్ రాజు బుధవారం తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు. మొత్తం 241 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు.



